మురుగు కాలువల్లో పూడికతీత

ప్రజాశక్తి-చెన్నూరు

పంచాయతీ పరిధిలోని అరుంధతి నగర్, కొత్త గాంధీనగర్, బెస్త కాలనీ, సరస్వతీ నగర్, లక్ష్మీ నగర్‌లలోని మురుగు కాలువల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు, మట్టితో పూడుకుపోయి వర్షపు నీరు వెళ్లకపోవడంతో స్థానిక ప్రజల ఫిర్యాదు మేరకు బుధవారం పంచాయతీ కార్యదర్శి రామసుబ్బారెడ్డి ఆయా కాలనీలలో పర్యటించి డ్రెయినేజీలను పరిశీలించారు. గ్రామ పంచాయతీ సిబ్బందితో మురుగు కాలువల్లో పూడికను తీయించారు. వర్షాకాలంను దృష్టిలో పెట్టుకొని ఎక్కడ కూడా ప్రజలకు అనారోగ్యం ప్రబలకుండా డ్రెయినేజీలలో బయోటిక్ ద్రావణాన్ని పిచికారి చేశారు. ప్రతిరోజు పంచాయతీలోని ఆయా వార్డులలో ఇండ్లలో ఉంటే ఇండ్లలో ఉండే చెత్తాచెదారం తీసుకెళ్లడానికి ట్రాక్టర్ వస్తుందని, గ్రామస్తులు తమకిచ్చిన తడి చెత్త, పొడి చెత్త బుట్టలలలో తడి చెత్త పొడి చెత్త వేరు చేసి వేయాలని వేయాలని పేర్కొన్నారు. ఎక్కడైనా ఏవైనా పారిశుద్ధ్యంకు సంబంధించిన సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని తెలిపారు.

కలుషిత ఆహారం తిని విద్యార్థులకు అస్వస్థత

సాంఘిక సంక్షేమ వసతి గృహంలో ఘటన - స్థానిక పిహెచ్‌సిలో చికిత్స - హాస్టల్‌ను పరిశీలించిన ఆర్‌డిఒ, డిఎంహెచ్‌ఒ, డిడి

ఓ ప్రయివేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులు

ప్రజాశక్తి-ముద్దనూరు

సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహంలో కలుషిత ఆహారం తిని ఎనిమిది మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. బుధవారం స్థానిక సాంఘిక సంక్షేమ వసతి గృహంలో ఉదయం అల్పాహారంలో భాగంగా హాస్టల్లో విద్యార్థులకు ఇడ్లి, సాంబారు ఏర్పాటు చేశారు. 28 మంది విద్యార్థులు అల్పాహారం తిన్నారు. వీరిలో యశ్వంత్, బన్నీ, వెంకటేష్, సతీష్, లక్ష్మి నరసింహులు, సుశాంత్, పెంచల్ నరసింహులు, నాగేంద్రకు కడుపు నొప్పి, వాంతులై అస్వస్థతకు గురయ్యారు. యశ్వంత్, బన్నీ తీవ్ర అస్వస్థతకు గురవడంతో ఓ ప్రయివేట్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. స్థానిక పిహెచ్‌సి వైద్యులు కరిష్మా, శ్రీకాంత్ బాధిత విద్యార్థులకు మందులు ఇచ్చి వైద్య పరీక్షలు నిర్వహించారు. జమ్మలమడుగు ఆర్‌డిఒ శ్రీనివాసులు హాస్టల్ వద్దకు చేరుకుని వంట గదిని, ఆహారాన్ని, పరిసరాలను పరిశీలించారు. అల్పాహారాన్ని పరిశీలించి బాధిత విద్యార్థులతో, హాస్టల్ వార్డెన్, కమాటి, వంట మనిషిని ఇలా ఎందుకు జరిగిందని ప్రశ్నించారు. అధికారులతో మాట్లాడి కారణాలు అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రిలో బాధిత విద్యార్థులను పరామర్శించారు. ఇడ్లి ఉడకలేదని సాంబారులో వేసిన కంది పప్పు ఉడకలేదని ఇవి తినడం వల్ల అస్వస్థతకు గురైనట్లు బాధిత పిల్లలు ఆర్‌డిఒకు తెలిపారు. ఉదయం అల్పాహారం ఇడ్లి, సాంబారు తిని బడికి వెళ్ళామని అక్కడ కడుపు నొప్పి, వాంతులు అయ్యాయని చెప్పారు. అల్పాహారం, భోజనం, కూరలు రుచికరంగా ఉండవని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆర్‌డిఒ శ్రీనివాసులు మాట్లాడుతూ అల్పాహారం, సాంబారు, నీటి శాంపిళ్ళు సేకరించి పరీక్షలు జరిపించాలని అధికారులకు సూచించారు. నీటి క్యాన్లతో నీటి సదుపాయం కల్పించాలని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని వార్డెన్ మనోహర్‌కు ఆదేశించారు. ప్రతి రోజు హాస్టల్ తనిఖీ చేయాలని విఆర్‌ఒకు సూచించారు. నాణ్యమైన, పరిశుభ్రమైన ఆహారాన్ని, నీరు అందించాలని ఆదేశించారు. అలసత్వం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సోషల్ వెల్ఫేర్ డిడి సరస్వతి, డిఎంహెచ్‌ఒ డాక్టర్ నాగరాజు హాస్టల్ పరిశీలించి అస్వస్థతకు గల కారణాలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఎంపిడిఒ చంద్ర మౌళీశ్వర్, సిఐ దస్తగిరి, డిప్యూటీ డిఎంహెచ్‌ఒ డాక్టర్ శివప్రసాద్ ఉన్నారు. వైద్య, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు మెరుగైన వైద్యమందించాలి

- విద్యార్థి సంఘాల డిమాండ్

మండల కేంద్రంలోని సాంఘీక సంక్షేమ బాలుర వసతి గృహంలో కలుషిత ఆహారం తిని అస్వస్థతకు గురైన విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించి ఇందుకు కారణమైన హాస్టల్ వార్డెన్, వంట మనిషిని సస్పెండ్ చేయాలని డివైఎఫ్ఐ, టిఎన్ఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘాలు డిమాండ్ చేశాయి. హాస్టల్‌లో అస్వస్థతకు గురైన విద్యార్థులను పరామర్శించి సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ సరస్వతికి వినతిపత్రం అందజేసినట్లు డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరనాల శివకుమార్, టిఎన్ఎస్ఎఫ్ జిల్లా పార్లమెంట్ అధికార ప్రతినిధి సిద్ధార్థ తెలిపారు. విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ విద్యార్థులు అస్వస్థతకు కారణం వార్డెన్ నిర్లక్ష్యమేనని స్పష్టంగా కనబడుతుందన్నారు. వంట మనిషి ప్రసాద్ వంట సరిగ్గా చేయడం లేదని విద్యార్థులను ఇబ్బందులు పెడుతున్నాడని వార్డెన్ మనోహర్ దృష్టికి తెచ్చిన పట్టించుకోకపోవడం వల్ల ఈ పరిస్థితి ఏర్పడిందన్నారు. హాస్టల్లో వార్డెన్ పర్యవేక్షణ లోపం పూర్తిగా కనబడుతుందన్నారు. అస్వస్థతకు గురైన విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలని వార్డెన్ మనోహర్, వంట మనిషి ప్రసాద్‌ను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. విద్యార్థులకు అస్వస్థతకు గురవడం బాధాకరమని ఇలాంటి సంఘటనలు మళ్లీ పునరావృతం కాకుండా ఉన్నతాధికారులు దృష్టి సారించాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం హాస్టళ్లకు మౌలిక సదుపాయాలు కల్పించి విద్యార్థులకు వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. పెండింగులో ఉన్న మెస్ బిల్లులు చెల్లించాలన్నారు. మిస్ బిల్లులు, ఇతర వాచ్‌మెన్, ట్యూటర్ వంటి పోస్టులు భర్తీ చేయాలన్నారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ నాయకులు మహేష్, ఎస్ఎఫ్ఐ ముద్దనూరు మండల నాయకులు గణేష్, నవీన్, గోపాల్, రాజమోహన్, టిఎన్ఎస్ఎఫ్ నాయకులు సుమంత్, పవన్ పాల్గొన్నారు.

విద్యార్థులతో మాట్లాడుతున్న ఆర్‌డిఒ, అల్పాహారాన్ని పరిశీలిస్తున్న ఆర్‌డిఒ శ్రీనివాసులు, డిడి సరస్వతికి వినతిపత్రం అందజేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

బదిలీ బెంగ!

యథా స్థానాల్లో కొనసాగేందుకు కొందరి యత్నం
సొంత జిల్లాకు రావడానికి పాత వారు మొగ్గు
వైసిపికి వంత పాడిన అధికారుల్లో వైరాగ్యం
అమాత్యుని అపాయింట్‌మెంట్లకు నిరీక్షణ
నేతల చుట్టూ అధికారుల ప్రదక్షిణలు

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

ఉమ్మడి జిల్లాలోని అధికారులకు బదిలీల బెంగ పట్టుకుంది. కూటమి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి కొంతమంది జిల్లా ఉన్నతాధికారులు యథాతథ స్థానాల్లో కొనసాగేందుకు తీవ్ర ప్రయత్నాలు చేసుకుంటున్నారు. వైసిపికి వంతపాడిన కొంతమంది జిల్లా స్థాయి ఉన్నతాధికారులు, రెడ్‌బుక్‌లో పేరు ఉందని భావించిన అధికారుల్లో వైరాగ్యం నెలకొంది. గతంలో జిల్లాలో పనిచేసి, ఇతర జిల్లాలకు బది లీపై వెళ్లిన అధికారులు సొంత జిల్లాలకు వచ్చేందుకు మొగ్గుచూపుతున్నారు. ఉమ్మడి జిల్లాకు చెందిన అమాత్యుని అనుగ్రహం కోసం పలువురు మండల, జిల్లాస్థాయి ఉన్నతాధికారులు ప్రదక్షిణలు చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాకు చెందిన మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి బిజీ షెడ్యూల్ కారణంగా పలువురికి అందుబాటులో లేకపోవడంతో నిరీక్షణ తప్పడం లేదు.

జిల్లాలోని అధికారుల్లో అలజడి నెలకొంది. రాష్ట్రంలో కూటమి సర్కారు అధికారంలోకి వచ్చిన వెంటనే ఐఎఎస్, ఐపిఎస్, ఐఎఫ్ఎస్ వంటి సివిల్ ఉద్యోగుల దగ్గర నుంచి జిల్లా, మండల స్థాయి అధికారులపై దృష్టి సారించింది. ఇందులోభాగంగా ఇటీవల పలువురు ఐఎఎస్‌లను, జిల్లాలో పోలీస్ యంత్రాంగంలో పలువురు సిఐలు, ఎస్ఐలు బదిలీలు చేసిన సంగతి తెలిసిందే. ఇందులోభాగంగానే త్వరలో కలెక్టర్, ఎస్పీ వంటి ఉన్నతాధికారుల బదిలీలు కూడా ఉం టాయనే ప్రచారం నడుస్తోంది. కడప, అన్నమయ్య జిల్లాలోని రాజకీయ నాయకత్వంలో భాగమైన ఎమ్మెల్యేలు, అమా త్యులు తమకు అనుకూలమైన అధికార యం త్రాంగాన్ని నియమిం చుకుని పాలన సాగించడం పరిపాటి. ఇందులో పలువురు ఉన్నతా ధికారులు యథాతథ స్థానాల్లో కొనసాగడానికి తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. ఇటువంటి అధికారుల కొనసాగింపు విషయంలో ఇటీ వలి కూటమి ఎమ్మెల్యేల సమావేశంలో ఊగిసలాటకు అవకాశం ఇవ్వ రాదని నిర్ణయం తీసుకోవడం గమనార్హం. దీంతో వైసిపికి వంత పాడిన, ఐటీ శాఖా మంత్రి లోకేష్ చేతిలోని రెడ్‌బుక్‌లో పేర్లు ఉన్న అధికారుల్లో నిస్తేజం నెలకొంది. ఇటువంటి పరిస్థితుల నేపథ్యంలో వైసిపి హయాంలో రాజకీయ ఒత్తిళ్ల వల్ల వారికి అనుకూలంగా పని చేయాల్సి రావడంతో నష్టం వాటిల్లిన వారికి ప్రభుత్వ పరంగా పరి హారం అందేలా చేస్తామని హామీలు సైతం ఇస్తున్నట్లు తెలుస్తోంది. ఉమ్మడి జిల్లాలోని రాయచోటి ఎమ్మెల్యే రాంప్రసాద్‌రెడ్డి రవాణా, యువజన, క్రీడలశాకా మంత్రిగా బాధ్యతలు చేపట్టడం, అనంతరం శాసన సభ సమావేశాలు ప్రారంభం కావడం, మంత్రి మండలి సమావేశంలో పాల్గొనడంతో ఆలస్యమైంది. ఇటీవల పలువురు మంత్రిని కలిసే ప్రయత్నం చేశారు. ఎవరికి ఎటు వంటి హామీ లభించలేదని తెలుస్తోంది. దీనికిముందే అన్నమయ్య జిల్లాకు చెందిన ఓ మహిళా ఉన్నతాధికారి పీలేరు ఎమ్మెల్యే దగ్గర బదిలీ అంశంపై ముందు గానే కట్ చీఫ్ వేసినట్టు ప్రచారం నడుస్తోంది. బదిలీల అంశం జిల్లా స్థాయి ఉన్నతాధికారుల్లో గూడుకట్టుకుని ఉన్న ఆందోళనకు అద్దం పడుతోంది. ఏదేమైనా బదిలీల వ్యవహారం ముగిసేవరకు అధికారు లు తమ తమ విభాగాలపై పూర్తిస్థాయిలో దృష్టి సారించే పరిస్థితి కనిపించడం లేదు. ఇందుకు అనుగుణంగానే ఉమ్మడి కడప జిల్లాలో ఇసుక, మట్టి అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతున్నప్పటికీ చేష్టలు డిగి చోద్యం చూస్తుండడం విస్మయాన్ని కలిగిస్తోంది. ఇప్పటికైనా జిల్లా రాజకీయ నాయకత్వం ఉన్నతాధికారుల బదిలీల వ్యవహారానికి ముగింపు పలికి, పాలనపై దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉందని చెప్పవచ్చు.

ఎన్నికల నిధులు స్వాహాపై విచారణ జరపాలి : యుటిఎఫ్

ప్రజాశక్తి-బద్వేలు

సార్వత్రిక ఎన్నికల నిర్వహణ కొరకు రాష్ట్ర ఎన్నికల కమిషన్ బద్వేలు నియోజకవర్గానికి కేటాయించిన నిధులలో దాదాపు రూ.కోటి స్వాహా చేశారనే ఆరోపణలు ఉన్నాయని, ఈ ఆరోపణలపై ఉన్నతాధికారులు వెంటనే స్పందించి విచారణ చేపట్టాలని యుటిఎఫ్ జిల్లా అధ్యక్షుడు మాదన విజయకుమార్ డిమాండ్ చేశారు. బుధవారం బద్వేలులోని స్థానిక ఎన్‌జిఒ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బద్వేలు నియోజకవర్గ పరిధిలోని ఏడు మండలాల్లో ఎన్నికల నిర్వహణ కొరకు ఎన్నికల కమిషన్ రూ.1.80 కోట్లు మంజూరు చేసిందన్నారు. ఈ నిధులతో ఎన్నికల నిర్వహణకు అవసరమైన సామగ్రిని కొనుగోలు చేయడంతో పాటు, ఎన్నికల విధులు నిర్వహించిన సిబ్బందికి రెమ్యూనరేషన్ కూడా చెల్లించాలన్నారు. ఎన్నికల సిబ్బందికి పూర్తిస్థాయిలో రెమ్యూనరేషన్ చెల్లించలేదని విమర్శించారు. ఎన్నికల విధులకు గాను రిజర్వుగా నియమించబడిన సిబ్బందికి కూడా ఏ ఒక్కరికి రెమ్యూనరేషన్ చెల్లించకుండా ఎగనామం పెట్టారని విమర్శించారు. రాత్రనకా, పగలనకా కష్టపడిన రెవెన్యూ సిబ్బందికి సైతం పూర్తి స్థాయిలో రెమ్యూనరేషన్ చెల్లించలేదన్నారు. ఎన్నికల నిధులకు ఆడిట్ లేని కారణంగా అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరించారని ఆరోపించారు. పెద్ద ఎత్తున తప్పుడు బిల్లులు సమర్పించి నిధులను కాజేశారనే ఆరోపణలు ఉన్నాయని పేర్కొ న్నారు. కష్టపడి పని చేసిన సిబ్బందికి రెమ్యూనరేషన్ చెల్లించకుండా ఇలా లక్షలాది రూపాయలను అధికారులు స్వాహా చేయడం దుర్మార్గమైన చర్య అని విమర్శించారు. కలెక్టర్ వెంటనే స్పందించి పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి, అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రిజర్వులో ఉండి, డ్యూటీలు కేటాయించబడని ఉద్యోగ, ఉపాధ్యాయులకు కూడా రెమ్యునరేషన్ చెల్లించాలని కోరారు. సమావేశంలో యుటిఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి కె.సుధాకర్, ట్రెజరర్ ఎ.గుర్రయ్య, గోపవరం మండల అధ్యక్షుడు వీరదాసరి క్రిస్టఫర్, జిల్లా కౌన్సిల్ సభ్యులు మహమ్మద్ గౌస్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మాదన విజయకుమార్

అర్ధనగ్న ప్రదర్శన చేస్తున్న సిపిఎం నాయకులు

తహశీల్దార్‌ను సస్పెండ్ చేయాలి

ప్రజాశక్తి-కలసపాడు

మండలంలో పెద్దఎత్తున అవినీతికి పాల్పడిన తహశీల్దార్ కృష్ణకుమార్, ఎగువ తంబళ్లపల్లె, పెండ్లిమర్రి విఆర్‌ఒలను వెంటనే సస్పెండ్ చేయాలని కెవిపిఎస్ జిల్లా కమిటీ సభ్యుడు డి.ప్రవీణ్ కుమార్ డిమాండ్ చేశారు. బుధవారం తహశీల్దార్ కార్యాలయం ఎదుట సిపిఎం, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో అర్ధనగ్న ప్రదర్శనతో ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని చెరువులలో మట్టి తవ్వకాలపై బద్వేల్ ఆర్‌డిఒ, కలెక్టర్‌కు తహశీల్దార్, విఆర్‌ఒలపై ఫిర్యాదు చేశామని పేర్కొన్నారు. బద్వేలు ఆర్‌డిఒ విచారణ చేసి వెళ్లారన్నారు. వారిపై ఎటువంటి చర్య తీసుకోలేదని తెలిపారు. పిడుగుపల్లె వద్ద ఒక పేద రైతు పారం కట్టలు లోడ్ వేసుకొని వెళుతుండగా ఈ నెల 21వ తేదీన తహశీల్దార్, విఆర్‌ఒ ఆ లారీని ఆపి రూ.40 వేలు జరిమానా వేశారన్నారు. వైసిపి నాయకులు తహశీల్దార్ కార్యాలయంలో పంచాయితీ చేసి లారీని వదిలిపెట్టారని తెలిపారు. జరిమానా వేసిన డబ్బులు వారి జోబులోరికి వెళ్లిందని విమర్శించారు. ఉన్నతాధికారులు స్పందించి ఎగువతంబళ్లపల్లె, పిడుగుపల్లె విఆర్‌ఒలు, తహశీత్దార్‌పై చర్య తీసుకొని వీరిని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ధర్నాలు, రాస్తారోకోలు చేసి కార్యాలయానికి తాళాలు వేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి జి.సుదర్శన్, ఆవాజ్ మండల అధ్యక్షులు హుస్సేన్ పీరా, కార్యదర్శి చిన్న, నాగురువల్లి సుబ్బరాయుడు పాల్గొన్నారు.

గంజాయి అక్రమ రవాణాపై ఉక్కుపాదం

- ఎస్‌పి సిద్ధార్థ్ కౌశల్

ప్రజాశక్తి-కడప అర్బన్

జిల్లాలో గంజాయి, ఇతర మాదక ద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణా, విక్రయాలపై కొరడా ఝుళిపించేందుకు వందరోజుల కార్యాచరణ ప్రణాళికతో పోలీస్ శాఖ చర్యలు చేపట్టినట్లు ఎస్‌పి సిద్దార్థ కౌశల్ తెలిపారు. బుధవారం స్థానిక జిల్లా పోలీసు కార్యాలయ ఆవరణంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రణాళికలో భాగంగా జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక పోలీస్ బృందాలతో నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గతంలో గంజాయి కేసుల్లో ఉన్నవారిని మళ్ళీ నేరాలకు పాల్పడకుండా పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చి కౌన్సిలింగ్ నిర్వహిస్తామని చెప్పారు. పదే పదే గంజాయి నేరాలకు పాల్పడే వారిపై హిస్టరీ షీట్లు తెరవడంతో పాటు పీడీ యాక్ట్ ప్రయోగిస్తామని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా చెక్ పోస్టులు ఏర్పాటు చేసి వాహనాల తనిఖీలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా నాకాబందీ నిర్వహించి అనుమానితుల ఇళ్లలో తనిఖీలు చేస్తామని చెప్పారు. గంజాయి, ఇతర మాదక ద్రవ్యాల ద్వారా కలిగే అనర్థాలపై కళాశాలలు, విద్యాసంస్థల్లో అవగాహనా సదస్సులు ఏర్పాటు చేస్తామని తెలిపారు. ప్రజలు గంజాయికి సంబంధించిన సమాచారాన్ని 14500 టోల్ ఫ్రీ నంబర్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు. సమాచారమిచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడుతుందని తెలిపారు. గంజాయి నిర్మూలనలో ప్రజలు తమ వంతు సామాజిక బాధ్యత గా పోలీస్ శాఖకు సహకరించాలని కోరారు. గంజాయి సేవించే వ్యసనానికి బానిసగా మారిన వారి సమాచారమిస్తే వారిని రిమ్స్ ప్రభుత్వ సమగ్ర వైద్యశాలలోని డి అడిక్షన్ కేంద్రానికి తరలించి తిరిగి వారిని సమాజంలో సాధారణ వ్యక్తుల్లా మార్చేందుకు పోలీస్ శాఖ చర్యలు చేపట్టిందని వివరించారు. కార్యక్రమంలో కడప డిఎస్‌పి షరీఫ్, వన్ టౌన్ సిఐ, ఎస్ఐ పాల్గొన్నారు.

ఇంటర్ సప్లిమెంటరీ ఫలితాలు విడుదల

ప్రజాశక్తి కడప అర్బన్

ఇంటర్మీడియట్ అడ్వాన్స్ సప్లిమెంటరీ మొదటి సంవత్సరం పరీక్ష ఫలితాలలను విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ బుధవారం విడుదల చేశారు. రాష్ట్ర స్థాయిలో వైఎస్ఆర్ జిల్లా 21వ స్థానంలో నిలిచినది. ఫస్ట్ ఇయర్ విద్యార్థులు మొత్తం 5740 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 2117 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. ఈ ఉత్తీర్ణత శాతం 37 శాతంగా నమోదైంది.

కబ్జాదారులపై చర్యలు తీసుకోండి

ప్రజాశక్తి-కడప అర్బన్

మా భూమి కబ్జా చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని బాధితురాలు రాజేశ్వరి అధికారులను వేడుకున్నారు. బుధవారం ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ వారసత్వ రీత్యా నా తండ్రి సుబ్బరాయుడు నుంచి 2.54 ఎకరాలు తమకు వచ్చిందని చెప్పారు. ఈ భూమి కొందరు కబ్జా చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని తెలిపారు. తహశీల్దార్, రెవిన్యూ అధికారులకు సమస్యను తెలియజేశామని పేర్కొన్నారు. వారిని కూడా బెదిరించడం కబ్జాదాలను బెదిరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

వసతి గృహాన్ని సందర్శించిన జడ్జి

ప్రజాశక్తి - కడప

కడప నగరం ప్రకాష్ నగర్‌లోని ప్రభుత్వ బిసి బాలుర వసతి గృహాన్ని బుధవారం సీనియర్ సివిల్ జడ్జి బాబా ఫక్రుద్దీన్ సందర్శించారు. అక్కడ న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. పిల్లలు ఏ ఏ తరగతులను అభ్యసిస్తున్నారు అడిగి తెలుసుకున్నారు. క్రమశిక్షణతో విద్యను అభ్యసించాలి, చదివిన సంస్థకు తల్లిదండ్రులకు మంచి పేరును తీసుకుని రావాలి అన్నారు. వసతి గృహంలోని వంటశాలను పరిశీలించారు. గుడ్ టచ్ మరియు బ్యాడ్ టచ్, భారత రాజ్యాంగము, జాతీయ న్యాయ సేవాధికార సంస్థ వారి బాలల సంరక్షణ కొరకు స్నేహపూర్వక న్యాయ సేవలు పథకం 2015, పిల్లల విద్యా, ఆరోగ్య విషయాల పట్ల తగు జాగ్రత్తలు వహించాలన్నారు. ఏవైనా సమస్యలుంటే జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ, కడప వారి దృష్టికి తీసుకొని రావచ్చును అన్నారు. కార్యక్రమంలో బిసి హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ

ప్రజాశక్తి- పోరుమామిళ్ల

పట్టణంలో ని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మేజర్ పంచాయతీ సర్పంచ్ యనమల సుధాకర్ మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. ఈ సందరేగా భోజన నిర్వాహకులు ప్రభుత్వం అనుసరిస్తున్న మెనూ ప్రకారమే భోజనాన్ని చేయాలన్నారు.విద్యార్థులంతా బాగా చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్ డా చంద్ర శేఖర్ రావ్ ,లేత్ షరీఫ్, చెన్ను రమణ, చొక్కం లక్ష్మణ రావ్ పాల్గొన్నారు.

ఊపందుకున్న పారిశుద్ధ్య పనులు

ప్రజాశక్తి-పోరుమామిళ్ళ

వానాకాలం ప్రారంభం కావడంతో గ్రామాల్లో పారిశుధ్య పనులు ఊపందుకున్నాయి. డ్రెయినేజీ కాలువల్లో పూడికతీత పనులు, మురుగు నీరు నిల్వ లేకుండా చేయడం, బ్లీచింగ్ పౌడర్ చల్లడం వంటి పనులను ఆయా పంచాయతీ కార్యదర్శులు చేపడుతున్నారు. ఇప్పటికే మండల ప్రత్యేకాధికారి చంద్ర శేఖర్, ఎంపిడిఒ వర ప్రసాద్ రావు, ఇఒపిఆర్‌డి రాజీవ్ రెడ్డి నిరంతరం పర్యవేక్షణ చేస్తున్నారు. రంగసముద్రం, పోరుమామిళ్ళ మేజర్ పంచాయతీల్లో ఎప్పటికప్పుడు దోమల నివారణ చర్యలు చేస్తున్నారు. ఇందుకుగాను ఎఎన్ఎంలు ఆయిల్ బాల్స్‌ను నిల్వ నీటిలో వేస్తున్నారు.

ఎఒకు వినతి పత్రం అందజేస్తున్న ఉపాధి కూలీలు

'ఉపాధి' బకాయిలను విడుదల చేయాలి

ప్రజాశక్తి-అట్లూరు

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం కింద కూలీ చేసిన పనులకు వెంటనే బకాయిలు చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు దుర్గమ్మ, రమణయ్య డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో కమలకూరు మన్యంవారిపల్లి, కాటంవారిపల్లి గ్రామాల ప్రజలు బుధవారం ఎంపిడిఒ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాలలో వలసలు నివారించాలని ఉపాధి పనులు ప్రవేశపెట్టారన్నారు. ప్రతివారం డబ్బులు చెల్లించే విధంగా గతంలో ఉందన్నారు. ప్రస్తుతం చేసిన పనులకు నాలుగైదు వారాలుగా కూలీలకు డబ్బులు చెల్లించడం లేదన్నారు. వలసలు నివారించాలంటే ప్రతి శనివారం చేసిన పనులకు డబ్బులు చెల్లించాలన్నారు. గతంలో సమ్మర్ అలవెన్స్, పనిముట్లు యథావిధిగా అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. వంద రోజులు పూర్తి చేసే విధంగా పనులు కల్పించాలని కోరారు. అనంతరం స్థానిక ఎంపిడిఒ కార్యాలయ ఎఒ భాస్కర్‌కు వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో రవిచంద్ర, సుభద్ర, స్వప్న, మాధవి, లక్ష్మీదేవి, నారాయణమ్మ పాల్గొన్నారు.

నేడు వేలం పాట

ప్రజాశక్తి-చెన్నూరు : గ్రామ పంచాయతీకి సంబంధించి 2024-2025 సంవత్సరానికి గాను బస్టాండ్, కూరగాయల మార్కెట్, జంతువుల శాల, గ్రామ పంచాయతీకి సంబంధించిన రూములకు గ్రామపంచాయతీ సర్పంచ్ సిద్దిగారి వెంకట సుబ్బయ్య ఆధ్వర్యంలో గురువారం మూడు గంటలకు గ్రామ పంచాయతీలో వేలంపాట నిర్వహిస్తున్నట్లు కార్యదర్శి రామ సుబ్బారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వేలం పాటలో పాల్గొన్న దలచిన వారు, వేలమునకు సంబంధించి గ్రామ పంచాయతీలో డిపాజిట్లు చెల్లించి వేలం పాటలో పాల్గొన వలసిందిగా కోరారు.

నోట్ బుక్స్, పాఠ్యపుస్తకాలు పంపిణీ

ప్రజాశక్తి-చెన్నూరు

మండలంలోని ముండ్లపల్లె ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు నోట్ బుక్స్, పాఠ్యపుస్తకాలను మండల విద్యాశాఖ అధికారి గంగిరెడ్డి, ఎంఇఒ-2 సునీత చేతుల మీదుగా బుధవారం విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులందరూ క్రమశిక్షణతో విద్యాభ్యాసాన్ని కొనసాగించాలని తెలిపారు. విద్యార్థులకు ఏవైనా నోట్ బుక్స్, పాఠ్య పుస్తకాలు, షూ్యష్, బ్యాగ్స్ వంటి విద్యా సామగ్రి ఏవైనా అందకపోతే తమ దృష్టికి తీసుకురావాలని తెలిపారు, విద్యార్థులందరికీ మెనుతో కూడిన భోజనం అందించాలని, పాఠశాల ఆవరణం పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రధాన ఉపాధ్యాయులకు తెలియజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు టి.చిన్న పరెడ్డి, నిర్మలా దేవి, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థికి పుస్తకాలు అందజేస్తున్న ఎంఇఒ

కుష్టు రహిత జిల్లాగా తీర్చిదిద్దండి : డిఆర్‌ఒ

లెప్రసీ పోస్టర్ ఆవిష్కరిస్తున్న అధికారులు

ప్రజాశక్తి-కడప అర్బన్

వైయస్సార్ కడప జిల్లాను కుష్టు వ్యాధి రహిత జిల్లాగా తీర్చిదిద్దడమే లక్ష్యమని డిఆర్‌ఒ గంగాధర్ గౌడ్ పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్లోని కమాండ్ కంట్రోల్ రూమ్‌లో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో లెప్రసీ కేసెస్ డిటెక్షన్ క్యాంపెయిన్‌పై డిఆర్‌ఒ అధ్యక్షతన జిల్లా సమన్వయ కుష్టి వ్యాధి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ కుష్టు వ్యాధి గుర్తింపు అవగాహన కార్యక్రమాన్ని జిల్లాలో వచ్చే నెల జులై 18వ తేదీ నుంచి ఆగస్టు 2వ తేదీ వరకు నిర్వహించనున్నామని తెలిపారు. ఈ కుష్టు వ్యాధి గుర్తింపు కార్యక్రమం ద్వారా ఆశా, వాలంటీర్, సచివాలయ ఎఎన్ఎంలు ఇంటింటికీ వెళ్లి సందర్శించి గృహంలో ఉన్న ప్రతి ఒక్కరిని పరీక్షించి ఎవరికైనా శరీరంపై రంగు మారిన మచ్చలు, చర్మంపై స్పర్శ లేని మచ్చలు, చెవులపై వీపుపై ఎదపై నొప్పి లేని బుడిపెలు, కనుబొమ్మలు, కనురెప్పల రాలిపోవడం, కనురెప్పలు మూతపడకపోవడం, ముక్కు దిబ్బడ ముక్కులో నుంచి రక్తం కారడం, తెలియకుండానే చేతులు కాళ్లలో బొబ్బలు రావడం, చేతి వేళ్ళు కాలు వేళ్ళు వంకర్లు తిరిగి అంగవైకల్యం రావడం వంటి లక్షణాలు ఉంటే వాటిని కుష్టి వ్యాధి అనుమానిత లక్షణంగా గుర్తించి వారి దగ్గరలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రంకు రిఫర్ చేస్తామన్నారు. ఆరోగ్య కేంద్రంలోని వైద్యాధికారులు వారిని పరీక్షించి ఎవరికైనా వ్యాధి నిర్ధారణ అయితే వారికి ఉచిత ఎండిటి మందులు ఆరు నెలలు లేదా సంవత్సర కాలము చికిత్స ఇవ్వడం జరుగుతుందన్నారు. ప్రజల ఆరోగ్యమే ప్రధాన లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం డబ్ల్యూహెచ్‌ఒ ప్రమాణాలను పాటిస్తూ అన్నిరకాల సౌకర్యాలు కల్పించిందని అందుకుతగ్గట్టు ప్రజలకు వైద్య సేవలు అందించడంలో నిమగ్నం కావాలని పేర్కొన్నారు. బీసీ, ఎస్టీ, ఎస్సీ హాస్టల్స్‌లలో ప్రతి ఒక్క విద్యార్థికి ఎల్సిడిసి టెస్ట్ నిర్వహించాలని సోషల్ వెల్ఫేర్ అధికారికి సూచించారు. ప్రభుత్వ పాఠశాలలో మార్నింగ్ ప్రేయర్ అసెంబ్లీలో లెప్రసీపై అవగాహన కలిగించేలా విద్యార్థులకు వివరించాలని జిల్లా విద్యాధికారికి సూచించారు. జిల్లాను కుష్టు వ్యాధి రహిత లక్ష్యంగా మార్చడానికి అందరూ కలిసికట్టుగా సమన్వయంతో ఎలెసిడిసి గుర్తింపు కార్యక్రమాన్ని జిల్లాలో జయప్రదం చేయవలసినదిగా తగు సూచనలు సలహాలు ఇచ్చారు. డిఆర్‌ఒ గంగాధర్ గౌడ్ లెప్రసీ క్యాంపెనింగ్ పోస్టంను డిస్టిక్ కో-ఆర్డినేటింగ్ కమిటీ సభ్యులతో కలిసి విడుదల చేశారు. కార్యక్రమంలో డిఎంహెచ్‌ఇఒ డాక్టర్ నాగరాజు, జిల్లా కుష్టు, ఎయిడ్స్, టిడి నివారణ అధికారి డాక్టర్ రవిబాబు, డిఇఒ అనురాధ, జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ శ్రీలక్ష్మి, జడ్‌పి సిఇఒ సుధాకర్‌రెడ్డి, సోషల్ వెల్ఫేర్ డిడి సరస్వతి, మెప్మా పీడీ సురేష్, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ చంద్ర శేఖర్, డిపిఎంఒ డాక్టర్ శశి భూషణ్‌రెడ్డి, డిఐఒ డాక్టర్ ఉమా మహేశ్వర్ కుమార్, జిల్లా ఫిజియో థెరపిస్ట్ డాక్టర్ వి.వి.మనోహర్, ఆర్‌బిఎస్‌కె మనోరమ పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువుల గురించి రైతులకు అవగాహన కల్పిస్తున్న కృష్ణ

సేంద్రియ ఎరువులు వాడితే అధిక దిగుబడి

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

సేంద్రియ ఎరువుల వాడితే అధిక దిగుబడి వచ్చి, మంచి లాభాలు చేకూరుతాయని నవభారత్ ఫర్టిలైజర్స్ ఫీల్డ్ ఆఫీసర్లు శ్రీకృష్ణ, ఎం.నాగేంద్ర పేర్కొన్నారు. మండల పరిధిలోని చిన్న రంగాపురం, బాపనపల్లె, ఇప్పట్ల మండలం చిన్న కోడల గ్రామాల్లో బుధవారం వారు రైతు సదస్సులను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పంట సాగులో రసాయన ఎరువులు అధికంగా వినియోగిస్తే ఆహార ఉత్పత్తులు విషతుల్యమవుతాయని వివరించారు. అంతేకాక క్రమక్రమంగా భూముల్లో నిస్సారమై, పంట దిగుమతులు తగ్గిపోతాయన్నారు. జీవకోటికి ముప్పు వాటిల్లుతుందని తెలిపారు. సేంద్రియ, జీవన ఎరువులు వాడడం వల్ల పెట్టుబడులను తగ్గించుకోవచ్చన్నారు. అధిక దిగుబడి సాధించవచ్చునని సూచించారు. నవభారత ఫర్టిలైజర్ సంస్థ 20 సంవత్సరాలుగా సేంద్రియ జీవన ఎరువులను అందిస్తోందన్నారు. పలు గ్రామాల్లో సేంద్రియ జీవన రైతు అవగాహన సదస్సు కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధులు ఎస్సార్, ఆర్ఎంఎస్, బి. కృష్ణమూర్తి, రైతులు పాల్గొన్నారు.

పూజలో పూర్వ మఠాధిపతుల కుమారులు, శ్రీజగన్మాత ఈశ్వరిదేవి మఠాధిపతులు

వైభవంగా సహస్ర జ్యోతి లింగార్చన

ప్రజాశక్తి - బ్రహ్మంగారిమఠం

జగద్గురు శ్రీమద్విరాట్ పోతులూరు వీరబ్రహ్మేంద్రస్వామి మఠంలో బుధవారం తూర్పుగోదావరి, కాకినాడ పురోహితం సంఘం వారి ఆధ్వర్యంలో పూర్వపు పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ వీర భోగ వసంత వెంకటేశ్వర స్వాముల వారి కుమారులు, శ్రీ జగన్మాత ఈశ్వరిదేవి మఠాధిపతి వీర శివకుమార్ స్వామి వారి దంపతులచే శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వాముల వారి సహస్ర లింగార్చన, రుద్ర హోయమం జరిపించారు. సాయంకాలం సహస్ర జ్యోతి లింగార్చన కార్యక్రమం నిర్వహించారు. ఆయా కార్యక్రమాలకు ఫిట్ పర్సన్ శంకర్ బాలాజీ, మఠం మేనేజర్ ఈశ్వరయ్య ఆచారి అన్ని ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో తాత్కాలిక ఆస్థాన సిద్ధాంతి జనార్ధన ఆచారి వారి శిష్య బృందం, శ్రీ చంద్రశేఖర్ శాస్త్రి గారి శిష్య బృందం పాల్గొన్నారు.

భోజన నాణ్యతను పరిశీలిస్తున్న ఎంపిడిఒ సుమిత్రమ్మ

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

ప్రజాశక్తి - ఖాజీపేట

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం నాణ్యతగా అందించాలని ఎంపిడిఒ సుమిత్రమ్మ ఆదేశించారు. నాణ్యత లోపిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. మండల పరిధిలోని పేరారెడ్డి కొట్టాలు సమీపంలోని ఆదర్శ పాఠశాలలో బుధవారం ఎంపిడిఒ మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. ఉపాధ్యాయుల పనితీరు, విద్యార్థుల హాజరు నమోదు, పాఠశాలలో మౌలిక సదుపాయాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఉత్తమ ఫలితాల సాధనకు ఉపాధ్యాయులు సమిష్టి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ విజయ నరసింహా, ఈఓపిఆర్‌డి వెంకటసుబ్బారెడ్డి, ఎంపిటిసీ చంద్రభాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

నిలువ పదార్థాలను వినియోగించరాదు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

రాష్ట్రవ్యాప్తంగా డయేరియా వ్యాధి ఆందోళన కలిగిస్తున్న నేపథ్యంలో స్టాప్ డయేరియా క్యాంపెయిన్-2024లో భాగంగా బుధవారం మున్సిపల్ సిబ్బంది పట్టణంలోని పలు హోటళ్లను తనిఖీ చేశారు. మున్సిపల్ కమిషనర్ రఘునాథరెడ్డి ఆధ్వర్యంలో మైదుకూరు రోడ్డు, శివాలయం రోడ్డులోని హోటళ్లు, బిరియాని సెంటర్లలోని ఆహార పదార్థాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నిలువ చేసే పదార్థాలను వినియోగించరాదన్నారు. హోటళ్లల్లో అపరిశుభ్రత వాతావరణం లేకుండా చూసుకోవాలన్నారు. నిషేధిత ప్లాస్టిక్ వాడకంపై ఆంక్షలున్నాయని, వాటిని వాడకూడదని యజమానులకు హెచ్చరించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్లు నూర్‌బాషా, సుబ్బరాయుడు, కిరణ్, ఎన్విరాన్‌మెంట్ కార్యదర్శులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

కించపరుస్తూ పోస్టు పెట్టాడని ఘర్షణ

- పలువురికి గాయాలు, కేసు నమోదు

ప్రజాశక్తి - పెద్దముడియం

గ్రామాల్లో కొందరు ఆకతాయిలు వాట్సప్, ఫేస్ బుక్ ద్వారా రాజకీయ వివాదాలను సృష్టిస్తూ గొడవలకు దారి తీసేలా.. ఇతరులను అవమానపరిచేలా పోస్టు చేస్తూ ప్రవర్తిస్తున్నారు. వీరి ప్రవర్తనతో విసిగిన కొందరు గొడవలకు దిగుతున్నారు. మండలంలోని కొండసుంకేసుల గ్రామంలో ఇదే తరహాలో టిడిపి, వైసిపికి చెందిన వర్గాలు గొడవలు పడుతున్నారు. మూడునెలల క్రితం టిడిపి వారిని కించపరుస్తూ సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేశారనే కారణంతో ఇరువురి మధ్య ఘర్షణ చోటు చేసుకోగా.. తాజాగా మంగళవారం రాత్రి వైసిపికి చెందిన వ్యక్తి టిడిపి వారిని కించపరుస్తూ ప్రసార మాధ్యమాల్లో పోస్టు పెట్టాడని ఘర్షణ పడ్డారు. ఈ ఘర్షణలో పలువురు గాయపడ్డారు. వీరిని జమ్మలమడుగు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ రామకృష్ణ పలువురిపై కేసు నమోదు చేశారు. సామాజిక మాధ్యమాల్లో అసభ్యకరమైన, ఉద్రేక భరితమైన రాజకీయ పోస్టు పెడితే వారిపై చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు.

మహిళ అదృశ్యంపై కేసు నమోదు

ప్రజాశక్తి - ముద్దనూరు

మండలంలోని ఓ గ్రామానికి చెందిన అవివాహిత అదృశ్యమైనట్లు ఆమె తండ్రి ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేశామని బుధవారం ఎస్ఐ మైనుద్దీన్ తెలిపారు. మహిళ ప్రొద్దుటూరులో ఓ ప్రయివేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తోంది. డ్యూటీకి వెళుతున్నానని ఇంట్లో చెప్పి సాయంత్రమైన తిరిగి రాకపోవడంతో.. బంధువుల వద్ద, చుట్టూ పక్కల వెతికినా కనిపించలేదని, కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

ప్రకృతి వ్యవసాయానికి పెద్దపీట లభించేనా..!

17 నెలలుగా వేతనాలకు నోచుకోని సిబ్బంది - కుటుంబ పోషణలో ఇబ్బందిపడుతున్న వైనం

ప్రజాశక్తి - సింహాద్రిపురం

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఏర్పాటుతో ప్రకృతి వ్యవసాయానికి పెద్దపీట లభించేనా అని రైతులు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఎదురు చూస్తున్నారు. క్షేత్రస్థాయిలో రైతులకు ఎలాంటి పెట్టుబడి వ్యయం లేకుండా ప్రకృతిలో లభించే అనేక రకాల మొక్కల నుంచి కషాయాలు తయారు చేసి పంటలకు వినియోగించేలా అవగాహన కల్పిస్తున్న సిబ్బందికి ప్రభుత్వం నుంచి వేతనాలు సకాలంలో అందడంలేదు. ఈ పరిస్థితుల్లో వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత వైసిపి ప్రభుత్వంలో 17 నెలలుగా సిబ్బంది వేతనాలకు నోచుకోలేదు. గ్రామస్థాయి నుంచి ఒక ఐసిఆర్‌పి, క్లస్టర్ స్థాయి నుంచి యూనిట్ ఇన్‌ఛార్జి, డివిజన్ స్థాయిలో డివిజన్ ఇన్‌ఛార్జిలు పనిచేస్తూ రైతులను ప్రకృతి వ్యవసాయం వైపు మళ్లించేలా పలు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు. అదే విధంగా క్షేత్రస్థాయిలో పలు మొక్కల నుంచి సేకరించిన రసాయనాల వినియోగంతో వచ్చిన ఫలితాలను మిగతా రైతులకు వివరిస్తున్నారు. ప్రకృతి వ్యవసాయం చేయడం వల్ల కలిగే ప్రయోజనాలను ఎప్పటికప్పుడు రైతులకు అందిస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి ఆశించిన స్థాయిలో సపోర్టు లభించక తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కొత్త ప్రభుత్వం రాగానే కొద్దిగా వ్యవసాయానికి పెద్దపీట వేస్తుందనే లక్ష్యంతో అటు రైతులు, ఇటు సిబ్బంది ఎదురుచూస్తున్నారు. మండల వ్యాప్తంగా దాదాపు 32 మంది సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా దాదాపు 715 మంది సిబ్బంది ప్రకృతి వ్యవసాయంలో విధులు నిర్వహిస్తున్నారు.

వేతనాలు రాక ఇబ్బందులు

గత ప్రభుత్వ హయాంలో 17 నెలలకు సంబంధించి వేతనాలు అందక సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రతి మండలానికి ఒకొక్క నెలకు దాదాపు రూ.2.5 నుంచి రూ.3.0 లక్షల వరకు వేతనాలు చెల్లించాల్సి ఉంది. అయితే ప్రభుత్వం ప్రకృతి వ్యవసాయ సిబ్బంది వేతనాల విషయంలో స్పందించకపోవడంతో కుటుంబ సభ్యులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రస్తుత పాలకులు స్పందించి తమ వేతనాలు వెంటనే చెల్లించేలా చర్యలు తీసుకోవాలని క్షేత్రస్థాయిలోని సిబ్బంది కోరుతున్నారు.

వేతనాలు రాని విషయం వాస్తవమే

గత 17 నెలలుగా వేతనాలు రాని విషయం వాస్తవమే. వేతనాలు రాకపోవడంతో మండల వ్యాప్తంగా పనిచేస్తున్న 31 మంది సిబ్బంది ఇబ్బందిపడుతున్నారు.

- శ్రీనివాసులు, ప్రకృతి వ్యవసాయం రిసోర్స్ పర్సన్, సింహాద్రిపురం

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పిస్తున్న ఐసిఆర్‌పిలు

వసతులు కల్పించాలని ఎమ్మెల్యేకు వినతి

ఎమ్మెల్యేకు సమస్యలను వివరిస్తున్న సిపిఎం నాయకులు, లబ్ధిదారులు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

ప్రొద్దుటూరు అమృత నగర్ స్థలాలకు కనీస వసతులు కల్పించాలని సిపిఎం పట్టణ కార్యదర్శి సత్యనారాయణ, లబ్ధిదారులు ఎమ్మెల్యే వరదరాజురెడ్డిని కోరారు. ఆ మేరకు బుధవారం వారు ఎమ్మెల్యేకు తమ బాధలను విన్నవించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ ఎమ్మెల్యేతో మాట్లాడుతూ 2008, 2018లో దాదాపుగా 2,500 మందికి స్థలాలిచ్చారని తెలిపారు. 15ఏళ్లవుతున్నా అక్కడ కనీస వసతులు కల్పించలేదన్నారు. అమృత్‌నగర్‌లో కరెంటు, మంచినీరు, రోడ్లు, హౌసింగ్ రుణాలు ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యేకు వివరించారు. ఆ మేరకు వినతిపత్రమిచ్చారు. సొంత డబ్బులు లక్షలు ఖర్చుపెట్టి బేసి మట్టాలు, కొందరు స్లాబ్ లెవల్ వరకు వేసుకున్నారని లబ్ధిదారులు తెలిపారు. ఎమ్మెల్యే స్పందిస్తూ కొద్ది రోజులు ఆగండి.. తర్వాత మీ సమస్య పరిష్కరిస్తామన్నారు. ఇప్పుడు ఎవరైనా ఇల్లు నిర్మించుకొని ఉంటే వారికి కరెంటు ఏర్పాటు చేయమని విద్యుత్ డిఇ శ్రీనివాసరెడ్డికి ఫోన్ చేసి చెబుతామన్నారు. ఎఇని అమృత నగర్ స్థలాలను పరిశీలించి సమస్య పరిష్కరించాలని తెలిపారు. ఎమ్మెల్యేని కలిసిన వారిలో హసీనా, పుష్పలత, నర్సింహులు, పెంచల్‌రెడ్డి, హరి, డివైఎఫ్ఐ నాయకుడు విశ్వనాథ్, చంటి బాబు, మల్లికా, భాను, పార్వతి, గోవిందమ్మ, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

ర్యాలీలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు

ప్రజాశక్తి - మైదుకూరు

ప్రపంచ మాదకద్రవ్యాల నివారణ దినోత్సవం సందర్భంగా బుధవారం మైదుకూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్ డాక్టర్ పి.నారాయణ రెడ్డి అధ్యక్షతన విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులు మాదక ద్రవ్యాల పట్ల అవగాహన కలిగి, వాటికి దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ పివి కృష్ణారెడ్డి, అధ్యాపకులు, మైదుకూరు ఎక్సైజ్ శాఖ, విద్యార్థులు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. పొట్టి శ్రీరాములు సర్కిల్ నుండి రాయల సర్కిల్ వరకు నిర్వహించారు. రాయల సర్కిల్‌లో మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేశారు. ఆర్ఆర్‌సి కో-ఆర్డినేటర్ అయ్యవారురెడ్డి, అధ్యాపకులు అనురాధ, చెన్నరాయుడు, డాక్టర్ నవనీశ్వర్ రెడ్డి, శ్రీనివాసులు, స్కిల్ హబ్ అధ్యాపకులు కేశవ, పట్టణ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ మస్తాన్, పోలీసులు పాల్గొన్నారు.

ముద్దనూరులో మానవహారంగా నిలిచిన విద్యార్థులు, అధికారులు

ముద్దనూరు : మాదకద్రవ్యాలు ప్రమాదకరమని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఇన్‌స్పెక్టర్ నాయుడు, సివిల్ సిఐ దస్తగిరి తెలిపారు. మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా బుధవారం ముద్దనూరు సెబ్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఆధ్వర్యంలో బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులతో మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం నాలుగు రోడ్ల కూడలిలో మానవహారంగా ఏర్పడ్డారు. డ్రగ్స్, హెరాయిన్, కొకేయిన్, గంజాయి వంటి మాదకద్రవ్యాలపై అవగాహన కల్పించారు. మాదకద్రవ్యాల వాడకం చట్టరీత్యా నేరమన్నారు. మాదకద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణా నిర్మూలనకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ మైనుద్దీన్, సెబ్ ఎస్ఐ శివ ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

ఎర్రగుంట్ల : మత్తు పదార్థాల వినియోగం చాలా ప్రమాదకరమని పట్టణ సీఐ ఈశ్వరయ్య, ఎస్ఈబి సిఐ లీలారాణి తెలిపారు. స్థానిక డిగ్రీ కళాశాలలో బుధవారం ఏర్పాటు చేసిన ' మత్తు పదార్థాల నియంత్రణ – నివారణ' అనే అవగాహన కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. యువత మత్తు పదార్థాలకు బానిసై తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారని తెలిపారు. యువత దేశ భవిష్యత్తు అన్నారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉండి యువత తమ ఉజ్వలమైన భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవాలని సూచించారు. ఎవరైనా మత్తు పదార్థాలు విక్రయించిన, వాడకానికి ప్రేరేపించిన వెంటనే 100 నెంబర్‌కు కాల్ చేసి సమాచారం ఇవ్వాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ ఈశ్వర్‌రెడ్డి, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ మల్లికార్జున రాజు, కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

జమ్మలమడుగు రూరల్ : విద్యార్థుల బంగారు భవిష్యత్తును మత్తు పదార్థాలు కాలరాస్తున్నాయని జమ్మలమడుగు బార్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ బూతమాపురం సుబ్బారావు పేర్కొన్నారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల నిరోధక దినోత్సవం సందర్భంగా జూనియర్ సివిల్ జడ్జి కోర్టు బార్ అసోసియేషన్ సభ్యులు, అడ్వకేట్లు, ఎక్సైజ్ పోలీసులు, స్థానిక పోలీసులు ప్రభుత్వ జూనియర్ కాలేజీ యాజమాన్యంతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సీఐ లతా, ఎస్ఐ సుబ్బారావు, బార్ అసోసియేషన్ అడిషనల్ సెక్రటరీ నాగార్జునరెడ్డి, సభ్యులు, అడ్వకేట్లు సురేంద్రా రెడ్డి, ఓబులేసు, కొత్తమాస్ భాస్కర్, విద్యార్థులు పాల్గొన్నారు.

వేంపల్లె : మాదకద్రవ్యాల నివారణలో మహిళల పాత్ర చాలా గొప్పదని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చెరసాల యోగాంజనేయులు పేర్కొన్నారు. బుధవారం స్థానిక అక్షర జూనియర్ కళాశాలలో వైఎస్ఆర్ వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలల ఆధ్వర్యంలో విద్యార్థులకు మాదకద్రవ్యాల నివారణలో మహిళల పాత్రపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రగ్స్ తీసుకోవడం వల్ల చాలా కుటుంబాలు పాడైపోతాయన్నారు. ఎస్ఇబి సిఐ సరితారెడ్డి, ఎక్సైజ్ సీఐ అన్నపూర్ణ మాట్లాడుతూ యువతను లక్ష్యంగా పెట్టుకొని డ్రగ్స్‌ను వేరే దేశాల నుండి దిగుమతి చేస్తున్నట్లు చెప్పారు. మహిళా అధికారులైన సరితారెడ్డి, అన్నపూర్ణను కళాశాల తరుపున ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ ఓబుల్‌రెడ్డి, డాక్టర్ మల్లేశ్వరమ్మ, ఫార్మసీ రేణుకా, అక్షర జూనియర్ కళాశాల కరస్పాండెంట్ విజయభారతి, ప్రసాద్ రాజు, ఎస్ఇబి సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్ఇబి సిఐ సరితారెడ్డిని సన్మానిస్తున్న కళాశాల అధ్యాపకులు

సీజనల్ వ్యాధులపట్ల అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - దువ్వూరు

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎంపిపి కానాల జయచంద్రారెడ్డి సూచించారు. స్థానిక ఎంపిడిఒ సభా భవనంలో బుధవారం సర్వసభ సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ఎంపిపి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీజన్ వ్యాధులపై ఆరోగ్యశాఖ తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ఎండాకాలంలో తాగునీటి సమస్య లేకుండా కృషి చేసిన అధికారులను ఎంపిపి అభినందించారు. కార్యక్రమంలో జడ్పిటిసి సభ్యులు కృష్ణయ్య యాదవ్, మండల ప్రత్యేక అధికారి మైఖేల్ రాజీవ్, ఎంపీడీవో సుగుణశ్రీ, తహశీల్దార్ ఉమారాణి, పిఓపిఆర్డి శివప్రసాద్, డిప్యూటీ తహశీల్దార్ అలీఖాన్, అన్ని శాఖల అధికారులు, సర్పంచ్‌లు, ఎంపిటిసి సభ్యులు పాల్గొన్నారు

విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

తెలుగుదేశం పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి వి.యస్. ముక్తియార్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం మౌళానా ఆజాద్‌వీధి-3లోని ఉర్దూ ఉన్నత పాఠశాల విద్యార్థులకు నోట్‌పుస్తకాలు, ప్యాడ్‌లు, పెన్నులు పంపిణీ చేశారు. జన్మదినోత్సవం గురువారం అయినప్పటికీ, ఆరోజు రక్తదాన శిబిరాలు, అన్నదానం కార్యక్రమాలుండడంతో ఒకరోజు ముందుగానే పిల్లలకు పంపిణీ చేపట్టారు. టిడిపి నాయకులు సిఎం సురేష్‌నాయుడు మాట్లాడుతూ ముక్తియార్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రతి సంవత్సరం సమాజసేవా కార్యక్రమాలు జరపడం ఆనవాయితీగా వస్తోందన్నారు. భవిష్యత్తులో తెలుగుదేశం పార్టీ ముక్తియార్‌కు మంచి గుర్తింపునిస్తుందనే ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు. ముక్తియార్ మాట్లాడుతూ విద్యార్థి దశలో కేవలం విద్యపైననే దృష్టి పెట్టి అన్ని పరీక్షలలో మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలన్నారు. విద్య మాత్రమే మనిషిని ఉన్నత స్థానానికి తీసుకెళ్తుందన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు ఖలీల్, మున్న ఉస్మాన్ పాల్గొన్నారు.

జిఓ 85ను ప్రభుత్వం రద్దు చేయాలి

ప్రజాశక్తి - వేంపల్లె

తెలుగు మాధ్యమాన్ని రద్దు చేస్తూ ఆంగ్ల మాధ్యమాన్ని ప్రవేశపెడుతూ విడుదల చేసిన జిఓ 85ను రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేయాలని పిసిసి మీడియా చైర్మన్ ఎన్.తులసిరెడ్డి కోరారు. బుధవారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ వైసిపి అయిదేళ్ల పాలనలో తెలుగు భాష పట్ల పూర్తిగా నిర్లక్ష్యం చేసిందన్నారు. టిడిపి ప్రభుత్వం వెంటనే జిఓ 85ను రద్దు చేసి తెలుగు భాషను రక్షించాలని కోరారు.

స్టేట్ ర్యాంకులతో 'శ్రీవిద్య' ప్రభంజనం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

స్థానిక సూపర్ బజార్ రోడ్డులోని శ్రీవిద్య జూనియర్ కళాశాల విద్యార్థులు జూనియర్ ఇంటర్ అడ్వాన్స్ సప్లమెంటరీ ఫలితాలలో స్టేట్ ర్యాంకులతో సత్తా చాటారని రమణారావు తెలిపారు. జూనియర్ ఎంపీసీ విభాగంలో ఏం తేజస్విని 470కి 467 మార్కులు సాధించి స్టేట్ ర్యాంకు సాధించిందన్నారు. జూనియర్ బైపీసీ విభాగంలో ఎస్ సాఫీయా 440 మార్కులుగాను 434 మార్కులు సాధించి జిల్లా ఫస్ట్ నిలిచారన్నారు. వీరితోపాటు పలువురు విద్యార్థులు మంచి మార్కులు సాధించారని ఆయన వివరించారు. ఇంతటి ఘన విజయానికి కారకులైన విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు కళాశాల డైరెక్టర్ శ్రీకాంత్ కుమార్ రెడ్డి, ఎం రామ్మోహన్ అభినందనలు తెలిపారు.



7న ఎంఆర్‌పిఎస్ జనజాతర సభ

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

ఎంఆర్‌పిఎస్ పురిటి గడ్డ ఈదుమూడిలో జులై 7న నిర్వహించు మాదిగల జనజాతర సభను జయప్రదం చేయాలని ఆ సంఘ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఆర్ఎన్ రాజా, ప్రొద్దుటూరు గడ్డం నరసింహులు కోరారు. పట్టణంలోని ఎంఆర్‌పిఎస్ కార్యాలయంలో సీనియర్ నాయకులు గడ్డం నరసింహులు ఆధ్వర్యంలో కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆర్ఎన్ రాజా మాట్లాడుతూ మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ఏర్పడి జూలై 7 నాటికి 30 వసంతాల పూర్తవుతుందన్నారు. ఈ సందర్భంగా మాదిగల జనజాతర సభను ప్రకాశం జిల్లా ఈదుమూడి కేంద్రంగా నిర్వహిస్తున్నామన్నారు. నూతనంగా అధికారంలోకి వచ్చిన ఎన్‌డిఎ ప్రభుత్వం వర్గీకరణ హామీని నిలబెట్టుకోవాలన్నారు. జన జాతర సభకు జిల్లా వ్యాప్తంగా వేలాదిగా తరలివెళ్లాలని, సభను జయప్రదం చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో ఎంఆర్‌పిఎస్ ప్రొద్దుటూరు డివిజన్ అధ్యక్షులు దాసరి ఓబులేష్, డివిజన్ మండల నాయకులు బాలసుబ్బయ్య, శ్రీనివాసులు, నారాయణ, చిన్న రంగనాయకులు, వెంకట రామంజనేయులు, పులయ్య పాల్గొన్నారు.

రెయిన్‌బో విద్యార్థి నవోదయకు ఎంపిక

ప్రజాశక్తి - ఖాజీపేట

స్వాతిక్‌రెడ్డి

నవోదయ ప్రవేశ పరీక్ష తొమ్మిదవ తరగతికి సంబంధించి నిర్వహించిన పోటీ పరీక్షలో స్థానిక రెయిన్‌బో పాఠశాల విద్యార్థి స్వాతిక్‌రెడ్డి ఎంపికయ్యారు. ఆ మేరకు పాఠశాల కరెస్పాండంట్ తవ్వా సుధాకర్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు విద్యార్థిని ఘనంగా అభినందించారు. సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. తమ పాఠశాల విద్యార్థులు చదువుల్లో మాత్రమే కాకుండా పోటీ పరీక్షల్లో సైతం తమ ప్రతిభను చాటుకోవడం చాలా సంతోషకరమన్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు విలువలతో కూడిన నాణ్యమైన విద్యను అందించడమే తమ సంస్థ ఏకైక లక్ష్యమన్నారు.

కూరగాయల మార్కెట్ పేరు మార్పు

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

పట్టణంలోని రంగనాథ స్వామి ఆలయం వద్ద ఉన్న కూరగాయల మార్కెట్‌కు హిందూ ఐక్యవేదిక సభ్యులు బిజెపి, టిడిపి, జనసేన నాయకులు పేరు మార్చారు. గతంలో శ్రీ రంగనాథ స్వామి కూరగాయల మార్కెట్‌గా ఉన్న పేరును వైసిపిలోని కొంతమంది నాయకులు వైఎస్సార్ కూరగాయల మార్కెట్‌గా పేరు మార్చారని, దీన్ని రంగనాథ స్వామి కూరగాయల మార్కెట్‌గా మార్చాలని కోరుతూ హిందూ ఐక్యవేదిక సభ్యులు కొన్నేళ్లుగా పోరాడుతున్నారు. అయితే అధికారంలో ఉన్న వైసిపి నాయకులు పేరు మార్చలేదు. ప్రస్తుతం ప్రభుత్వం మారడంతో హిందూ ఐక్యవేదిక సభ్యులతోపాటు బిజెపి జిల్లా అధ్యక్షులు శశిభూషణ్‌రెడ్డి, టిడిపి నాయకులు తూగుంట్ల మధుసూదన్‌రెడ్డి, వెంకట్రామిరెడ్డి, భాస్కర్ రెడ్డి, తుగుట్ల సిద్ధారెడ్డి, మహబూబ్ బాషా, జనసేన నాయకుడు జగదీష్ కూరగాయల మార్కెట్‌కు రంగనాథ స్వామి కూరగాయల మార్కెట్‌గా మార్చుతూ బోర్డును ఏర్పాటు చేశారు.

కౌన్సిల్ ఆమోదం లేకుండా పేరు మార్చడం సరైందికాదు

- మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్లు

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పులివెందుల కూరగాయల మార్కెట్‌కు మున్సిపాలిటీ కౌన్సిల్ ఆమోదం లేకుండా కూటమి నాయకులు పేరు మార్చడం సరైన పద్ధతి కాదని మునిసిపల్ చైర్మన్ వరప్రసాద్, వైస్ చైర్మన్లు వైఎస్ మనోహర్‌రెడ్డి, హఫీజ్ పేర్కొన్నారు. బుధవారం వైఎస్ మనోహర్‌రెడ్డి ఇంటి వద్ద జరిగిన మీడియా సమావేశంలో వారు మున్సిపల్ కౌన్సిలర్లతో కలిసి ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ పులివెందుల కూరగాయల మార్కెట్‌ను గత ప్రభుత్వ హయాంలో ఎంతో అభివృద్ధి చేశామన్నారు. అప్పట్లో స్థానిక మార్కెట్ వ్యాపారస్తులు, ప్రజలు వైఎస్సార్ పేరు పెట్టాలని వినతి పత్రం ఇవ్వడంతోనే కౌన్సిల్‌లో ఆమోదించి మార్కెట్‌కు దివంగత వైఎస్సార్ పేరు పెట్టామన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు పార్ణపల్లి కిషోర్, ఖాదర్, రాజశేఖర్‌రెడ్డి, దానియేలు, గండి రాము, చంద్ర మోహన్, రవి, శివలక్ష్మి, లక్ష్మి ప్రసన్న, రజియా, అంకాలమ్మ గుడి చైర్మన్ బ్యాటరీ ప్రసాద్, కో-అప్షన్ మెంబర్ చంద్ర మౌళి, వైసిపి చారిటబుల్ ట్రస్టు చైర్మన్, ఇరికిరెడ్డి వీరారెడ్డి పాల్గొన్నారు.

బస్టాండ్ వేలంలో రూ.8.26 లక్షల ఆదాయం

ముద్దనూరు : ముద్దనూరు మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలోని బస్టాండ్, జంతు వధశాల, సులభ్ కాంప్లెక్స్‌కు బుధవారం గ్రామ సచివాలయంలో ఈఓపిఆర్డీ వీరభద్రుడు బహిరంగ వేలం పాట నిర్వహించారు. పంచాయతీ ఆదాయం కోసం బస్టాండ్‌కు సర్కారు నిర్ణయించిన ధర రూ.8లక్షల 25వేలు కాగా బహిరంగ వేలంలో వినోద్ అనే వ్యక్తి రూ.8లక్షల 26వేలుకు దక్కించుకున్నాడు. జంతు వధశాలకు రూ.లక్ష 32 వేలు నిర్ణయించగా, రామ లక్షుమమ్మ రూ.లక్ష 33వేలకు దక్కించుకున్నట్లు ఈఓపిఆర్డీ చెప్పారు. సులభ్ కాంప్లెక్స్ పాడేందుకు ఎవరు రాకపోవడంతో వేలం వాయిదా వేసినట్లు చెప్పారు.

ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట

ఎర్రగుంట్ల : స్థానిక మండల పరిధిలోని హనుమనగుత్తి గ్రామం వద్దనున్న పెన్నా నది పరివాహకం నుండి అక్రమంగా తరలిస్తున్న ఇసుక రవాణాకు తహశీల్దార్ సౌజన్యలక్ష్మి అడ్డుకట్ట వేశారు. ఇసుకను అక్రమంగా తరలిస్తుండడంతో స్థానికంగా ఉన్న పొలాలకు సంబంధించిన బోర్లకు నీరు అందక అడుగంటుతున్నాయని గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. రాత్రి సమయాల్లో ట్రాక్టర్లు, టిప్పర్ల సహాయంతో ఇసుకను అక్రమంగా తరలిస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. గ్రామస్తుల ఫిర్యాదు మేరకు బుధవారం తహశీల్దార్ పెన్నా నది పరివాహకాన్ని పరిశీలించారు. నదిలోకి టిప్పర్లు, ట్రాక్టర్లు వెళ్లే దారిని జెసిబి యంత్రంతో తొలగించారు. కార్యక్రమంలో రీసర్వే డిప్యూటీ తహశీల్దార్ రమణారెడ్డి, మండల సర్వేయర్ లక్ష్మీనారాయణ, వీఆర్వోలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

కష్టపడిన ప్రతి కార్యకర్తకు తగిన గుర్తింపు : బిటెక్ రవి

సింహాద్రిపురం : తెలుగుదేశం పార్టీ అభ్యున్నతి కోసం కష్టపడిన ప్రతి కార్యకర్తకు తప్పకుండా గుర్తింపు ఉంటుందని నియోజవర్గ టిడిపి ఇన్‌ఛార్జి మారెడ్డి రవీంద్రనాథ్‌రెడ్డి(బీటెక్ రవి) పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రమైన తన నివాసంలో నియోజవర్గంలోని అన్ని మండలాలకు చెందిన పలువురు టిడిపి నాయకులు, కార్యకర్తలు ఆయనను కలిశారు. ప్రజల నుంచి వినతులు స్వీకరించి అవసరమైన వారికి సంబంధిత అధికారులకు ఫోన్ చేసి సమస్యను పరిష్కరించాలని సూచించారు. మీసేవ సమస్యలపై ఆ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు అంజన్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు సునీల్ బీటెక్ రవికి వివరించారు. సంబంధిత శాఖ అధికారులతో మాట్లాడి పరిష్కారం చూపుతామని వారికి హామీ ఇచ్చారు.